క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన

పాన్‌గల్: ప్రతి విద్యార్థి సామర్థ్యాలు పెంచుతూ వారికి చదవడం, రాయడం వచ్చేలా బోధన చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



పాన్‌గల్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో వసతులు కల్పించాలని తహసీల్దార్ సుభాష్‌నాయుడు క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని మాందాపూర్, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి, వెంగళాయిపల్లి, చింతకుంట, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించి వసతులపై ఆరా తీశారు. పార్లమెంటు ఎన్నికలకు మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లిలో అక్సాలరీ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోలింగ్ బూత్ ఏర్పాటుతో మండలంలో 44 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ అశోక్ నాయుడు, ఆర్ఐలు మహేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఫౌంటేన్ కాదు.. 'భగీరథ' లీకేజీ



అమరచింత: నీరు పైకి ఎగిసి పడుతున్న చిత్రాన్ని చూస్తే ఇదోదే ఫౌంటేన్ అనుకుంటే పొరపాటే. అమరచింత పట్టణంలోని ఏడో వార్డులో చిన్ని శ్రీనివాసులు ఇంటి వెనకాల ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు ఇలా ఎగిసిపడుతోంది. పైప్‌లైన్లను ఫీటు లోతులోనే వేయడంతో అటుగా ట్రాక్టర్ వెళ్లడంతో పైప్ పగిలిపోయింది. దీంతో తాగునీరు కుళాయిలకు వదిలినప్పుడల్లా ఇలా వృథాగా పారుతుంది. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన పాటించాలి



పెబ్బేరు రూరల్: పెబ్బేరు, శ్రీరంగాపురం మండలంలోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని ఎంఈఓ జయరాములు సూచించారు. పెబ్బేరు మండల కేంద్రంలోని చెంచువాడ పాఠశాలను ఎంఈఓ జయరాములు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలిస్తూ.. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. తరగతి గదిలో విద్యార్థుల స్పందన బాగుందన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వేసవిలో విద్యార్థులు ఎండలో తిరగకుండా, నీటి కుంటలు, బావుల వద్దకు వెళ్లకుండా జాగ్రతలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

పాఠశాలకు రెండు బల్లాల వితరణ



పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ సురేందర్‌రెడ్డి రూ.9వేల విలువైన రెండు బల్లలను శుక్రవారం వితరణగా అందజేశారు. పాఠశాలకు రెండు బల్లలను వితరణగా అందించడంపై ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, కేతేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం రవికుమార్, హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్ అభినందించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించిన సందర్భంగా మండల గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనం వద్ద పాలాభిషేకం చేసినట్లు కాంగ్రెస్ మత్స్యశాఖ ఉపాధ్యక్షుడు నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, గోపాల్, బాలస్వామి, యాదయ్య, శ్రీనువాసులు, సూరి, వెంకటయ్య, చెన్నయ్య, అంజనేయులు, నర్సింహులు, రాజు, పెంటయ్య, బాలయ్య, కృష్ణయ్య, గోపాల్, వేణు ఉన్నారు.

కాల్వల మరమ్మతు జరిగేనా?

- జూరాల, భీమా కాల్వల ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరు
- ఏళ్లు గడుస్తున్నా నిర్వహణ శూన్యం
- ప్రధాన, మైనర్, పంట కాల్వల్లో ముళ్లపొదలు



భీమా కాల్వలో ముళ్లపొదలు



జూరాల 28 డిస్ట్రిబ్యూటరీ వద్ద పాడైన ప్రధాన కాల్వ

వీపనగండ్ల: మండలంలో ప్రవహిస్తున్న జూరాల, భీమా కాల్వ ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోవట్లేదు. యాసంగిలో పంటలకు క్రాప్ హాలీ డే ప్రకటించిన అధికారులు ఈసారైనా పాడైన పంట కాల్వల మరమ్మతు పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. కాల్వల్లో కంపచెట్లు, జమ్ము మొలవడంతో పాటు కాల్వ సైడ్ వాల్స్ పూర్తి దెబ్బతిన్నాయి. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందకపోవడం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎన్నోమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం ఉండట్లేదని రైతులు వాపోతున్నారు. ఈ వేసవిలోనైనా పాడైన కాల్వల మరమ్మతు పనులు చేపట్టాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

మండలంలో పరిస్థితి

మండలంలోని జూరాల కెనాల్ ద్వారా 4,300 ఎకరాలు, భీమా కాల్వ ద్వారా 14వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీంతోపాటు మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి చిన్నంబావి, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని దాదాపు 40 గ్రామాలకు తాగునీరు అందుతుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ యాసంగిలో దాదాపు 90 శాతం రైతులు పంటలను సాగు చేయలేదు.

చివరి ఆయకట్టు అందని నీరు

జూరాల కాల్వ ద్వారా గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, సంగినేనిపల్లి, తూంకుంట, సంపత్‌రావుపల్లి గ్రామాల పంట పొలాలకు భీమా కాల్వ ద్వారా రంగవరం, పుల్గర్‌చర్ల, కల్వరాల, బొల్లారం, కొర్లకుంట, సంగినేనిపల్లి గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ప్రధాన కాల్వలతో పాటు సబ్ మైనర్లు, పంట కాల్వలు పలు గ్రామాల సమీపంలో పూర్తిగా పాడవడం షిల్ట్, జమ్ము పేరుకుపోవడం, కంపతార చెట్లు కాల్వలను కప్పి వేయడం వల్ల చివరి ఆయకట్టు గ్రామాల పంటలకు ప్రతి ఏటా సాగునీరు అందడం లేదు.

మరమ్మతు చేపట్టాలి



భీమా ప్రధాన కాల్వలో పూడిక తీయకపోవడం వల్ల పలు గ్రామాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సరిపడా సాగు నీరు రాకపోవడం వల్ల పుల్గర్‌చర్ల, కల్వరాల, సంగినేనిపల్లి గ్రామాల రైతుల మధ్య విబేధాలు ఏర్పడి ఘర్షణలు పడ్డ ఘటనలు చోటు చేసుకున్నాయి. అధికారులు స్పందించి పూర్తి స్థాయి మరమ్మతు చేపట్టాలి.

– మౌలాలి, మాజీ సర్పంచ్, సంగినేనిపల్లి

నిధులు కేటాయించాలి



మండలంలోని పాడైన కాల్వల మరమ్మతు కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి. పంటలు ఎండిపోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్భాటపు ప్రకటనలు ఇవ్వడమే తప్ప అవసరమైన ఆచరణలో సాధ్యం కావడం లేదు. వేసవిలో మరమ్మతు పనులను గుర్తించి నిధులు కేటాయించాలి. లేకుంటే రైతులను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తాం.

– మహబూబ్‌పాషా, సీపీఎం నాయకుడు

రూ.30 లక్షల పనులకు ప్రతిపాదనలు



పాడైన కాల్వను గుర్తించి అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల కోసం రూ.30 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. రైతుల సహకారంతో మరమ్మతు పనుల కోసం మరిన్ని ప్రతిపాదనలు పంపేందుకు ప్రయత్నిస్తాం.

– ప్రభు, జూరాల ఏఈ, పెబ్బేరు ప్రాజెక్ట్

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



సంకిరెడ్డిపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చెన్నమ్మ



నందిమళ్లలో..

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల సంరక్షణపై దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నందిమళ్ల గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణ కోసం తీసుకుంటున్న జాగ్రత్తల గురించి పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు నర్సరీలో ఎలాంటి మొక్కలు పెంచుతున్నామనే సమాచారం గ్రామస్తులు తెలుసుకునే విధంగా పలకలపై రాసి ఉంచాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. వేసవి తీవ్రత పెరిగినందున నర్సరీలోని మొక్కలు వాడుముఖం పట్టకుండా గ్రీన్ నెట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారులకు ఇరువైపుల, ప్రార్థన మందిరాలు, పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలు వాడుముఖం పట్టకుండా వాటికి రోజువారి నీటిని అందించాలని ఆదేశించారు.

కొత్తకోట రూరల్: వేసవిలో ఎండల తీవ్రతగా ఎక్కువగా ఉండటంతో నర్సరీలో గల మొక్కలు ఎండిపోకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తకోట ఎంపీడీఓ చెన్నమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని సంకిరెడ్డిపల్లి శివారులో గల నర్సరీలోని మొక్కలను ఎంపీడీఓ పరిశీలించారు. మొక్కలు ఎండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉదయం, సాయంత్రం రెండు సార్లు మొక్కలకు నీళ్లు పట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాములు, పంచాయతీ కార్యదర్శి ప్రీతిసూదన్, టీఏ అరుణ, పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట గ్రామంలోని పాతజంగమాయపల్లి శివారులో గల ఊక చెట్టు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే ప్రాథమిక సమాచారంలో పోలీసులు వాగు వద్దకు చేరుకోగా ఇసుకను లోడ్ చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని విచారించగా ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ నరుకుల శివకుమార్, యజమాని ముంత రాంచంద్రయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

నేడు ప్రముఖుల రాక

ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లి వీరభద్రస్వామి ఆలయంలో ఉత్సవాల కోసం శ్రీశైలం పీఠాధిపతి జగద్గురు డాక్టర్ సిద్దిరామాపండితారాధ్య, ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు వాకిటిశ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంటు చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ హాజరవుతున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రత్యేక పూజలు అనంతరం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండశ్రీను కోరారు.

మోసగాళ్లతో జాగ్రత్త

పెబ్బేరు రూరల్: సమాజంలో జరుగుతున్న మోసాలతో పౌరులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని వనపర్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రవికుమార్ అన్నారు. శుక్రవారం వనపర్తి మండలం చిమనగుంటపల్లిలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లోక్ అదాలత్ సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, అమ్మాయిలపై వేధింపులకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. ఎస్ఐ జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉత్తరయ్య, కృష్ణయ్య, నరేందర్‌బాబు, తిరుపతయ్య, ఎంపీఓ సుదర్శన్, ఎంపీటీసీ ధర్మశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



బహుజన బాంధవుడు కాన్షీరాం

కొత్తకోట రూరల్: బహుజన బాంధవుడు కాన్షీరాం అని బీఎస్పీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి సంతోష్‌రెడ్డి అన్నారు. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కొత్తకోటలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ కులాన్ని నిర్మూలిద్దాం బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టిన మహానాయకుడు కాన్షీరాం అని కొనియాడారు. బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించిన గొప్ప వ్యక్తి అని, బీసీలకు రిజర్వేషన్లు సాధించి పెట్టిన రాజనీతిజ్ఞుడు, ఆయన దేశానికి చేసిన సేవలను ప్రజలు మర్చిపోలేరన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు రాజమౌళి, మాసన్న, కుర్మన్న, దినకర్, సాగర్, లక్ష్మణ్, రవీందర్, ఎండీ గౌస్, రాములు, కళ్యాణ్, శ్రీకాంత్, ఎర్రన్న తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేత



పెబ్బేరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే ఒక పూట అంగన్‌వాడీ కేంద్రాలు నడిపేందుకు అనుమతించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి డీడబ్ల్యూఓ లక్ష్మీబాయి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ మే నెలలో టీచర్లకు హెల్పర్లకు ఒకేసారి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాడైన ఫోన్లతో ఫ్యామిలీ సర్వే చేయలేమని ల్యాప్‌టాప్‌లు ఇచ్చాకే ఫ్యామిలీ సర్వే చేస్తామన్నారు. 8 నెలల భవనాల అద్దెలు, సిలిండర్ బిల్లులు, మూడేళ్ల ఈవెంట్స్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించుకుంటే అంగన్‌వాడీలతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో కవిత, నారాయణమ్మ, జ్యోతి, బొబ్బిలి నిక్సన్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుపై హర్షం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారంటీలను 100రోజుల్లో అమలు చేసిందని, దీంతో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట ఇస్తే తప్పకుండా నెరవేర్చే సిద్ధాంతం ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఇచ్చిన మాట ప్రకారం 100రోజుల్లో ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీపై ఆదరణ పెరుగుతుండటంతో జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు లేని పోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలు తప్పకుండా అందుతాయని, ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు సంద వెంకటేష్, రైతు సంఘం నాయకులు బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్య

గోపాల్‌పేట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ సంధ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సంధ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పాలన అందించాలని కోరారు. మూడెకరాల లోపు పొలం ఉన్న రైతులకు రైతుబంధు డబ్బులు పడ్డాయని, మిగతా వారికి కూడా తొందరలో పడే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. పశువైద్య శాఖ తరఫున మండల అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పశువులకు అందించిన టీకాలు, వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. నాలుగు నెలలుగా నట్టల నివారణ మందులు రావడం లేదని, సమస్య తలెత్తకుండా చూడాలని వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ కోరారు. ఎండాకాలం వచ్చినందున అప్రమత్తంగా ఉండాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఏఈ మొగులయ్యకు సూచించారు. గ్రామాల్లోని ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు వేసేటప్పుడు ప్రోటోకాల్ పాటించలేదని, కనీసం ఎక్కడి నుంచి ఎక్కడికి సీసీలు వేస్తున్నారో చెప్పడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. వరి పంట చివరి దశలో ఉన్నందున ప్రభుత్వం స్పందించి వనపర్తి జిల్లాలోని ప్రజలకు కేఎల్ఐ కాల్వ ద్వారా సాగునీరు వచ్చేలా చూడాలని వైస్ ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు కలెక్టర్ చేయూత



వనపర్తిలో విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి

వనపర్తి టౌన్: కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు బోర్డు పరీక్షలు రాసేందుకు ప్రతి విద్యార్థికి ఒక ప్యాడ్, రెండు బ్లూ పెన్నులు, ఒక బ్లాక్ పెన్ను, 5 స్టిక్ పెన్నులు, ఒక స్కేల్‌ను ప్రతి పాఠశాలకు పంపించినట్లు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉమాదేవి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో వనపర్తి నిలిచేలా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూర్జహాన్, చెన్నపద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్న సందర్భంగా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ విద్యార్థులకు చేయూతనిచ్చారని మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్ తెలిపారు. శుక్రవారం ఆత్మకూర్, అమరచింత మండలాల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, బ్లూ, బ్లాక్, రెడ్, స్టిక్ పెన్నులు, స్కేళ్లు, తదితర సామాగ్రిని ఆయా పాఠశాలల జీహెచ్‌ఎంలకు అందజేశారు. కలెక్టర్ విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు పరీక్ష సామగ్రి సమకూర్చారని, కలెక్టరుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన




విద్యార్థులకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అమరచింత: చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి చేరకుండా కాపాడుకునే అవకాశం ఉందని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం హ్యాండ్‌వాష్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులకు సబ్బునీటితో కడుకోవాలని, మలమూత్ర విసర్జనకు వెళ్లిన ప్రతిసారి కాళ్లు, చేతులు నీటితో కడుకోవాలని సూచించారు. అదే విధంగా భోజన సమయంలో తప్పకుండా చేతులను సబ్బునీటితో కడుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బాలేశ్వరి, రాధిక, నాగేంద్రమ్మ, వజ్రమ్మ, మాధవి పాల్గొన్నారు.

కులం, మతం పేరిట ఓట్లు వేయొద్దు

ఆత్మకూర్: దేశంలో ఓటుహక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా ఉందని, కులం, మతం పేరిట ఓట్లు వేయడం భావ్యం కాదని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, అర్షవిద్యా నిష్ణాత, కవి పరమేశ్వర బాబుదేవిదాస్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా శాంతి, క్షేమం మరచి స్వార్థం, కులతత్వం, పరస్పర శతృత్వం, రాజకీయ ద్వేషం అజెండాగా రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు దేశ ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సంస్కృతి సాంప్రదాయాలను పాటిస్తూ ఆరోగ్యకరమైన వాతవరణం నెలకొల్పేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజలు రానున్న ఎన్నికల్లో కులం, మతం పక్కన బెట్టి అభ్యర్థి వ్యక్తిత్వం చూసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు.


పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అమరచింతలో..



శ్రీరంగాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్



కనిమెట్టలో..

అమరచింత: పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. 'పోషణ్ బీ-పడాయిబీ' కార్యక్రమంలో భాగంగా పోషక పదార్థాల గురించి శుక్రవారం ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, ప్రసూతి, కిశోర బాలికలు క్రమం తప్పకుండా అంగన్‌వాడీల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారం స్వీకరించాలని సూచించారు. ఆకుకూరలు తినడం ద్వారా కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధిక, నాగేంద్రమ్మ, వజ్రమ్మ, బాలేశ్వరి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: చిరుధాన్యాలతో కూడిన పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపర్‌వైజర్ బాలీశ్వరి తెలిపారు. పోషకాహార వారోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీరంగాపురం: మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషక పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీసుకోవడం వల్ల విలువలతో కూడిన పోషకాలు లభిస్తాయన్నారు. గర్భిణులు నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీణత లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజులారాణి, శాంతాబాయి, కైసర్‌బేగం, రాధ, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షం నిర్వహించారు. ఈ సందర్భంగా 'బేటీ బచావో బేటీ పడావో' అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు వంద శాతం పౌష్టికాహారం అందించి రక్తహీనత లోపాన్ని అధిగమించాలని ప్రభుత్వం పోషణ పక్షం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా మాతా శిశుసంరక్షణకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ధర్మాదేవి, శుభాషిణి, చిన్నారుల తల్లులు ఉన్నారు.